## క్లుప్తంగా

### మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ దంపతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి జిల్లా గూడూరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు విచ్చేసిన విజయసాయిరెడ్డిని మేయర్ దంపతులు శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు.

### నేడు కార్పొరేషన్‌లో స్పందన

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరుగుతుందని నగర కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలోనూ నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆయన తెలిపారు.

### ఎన్నికలపై అవగాహన

సోమశిల: అనంతసాగరం మండలం వరికుంటపాడులో ఆదివారం సాయంత్రం ఆత్మకూరు సీఐ వేణు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించడం, వాహనాల్లో మద్యం తరలించడం చేస్తే వాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి, ఏఎస్సై మస్తాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సందడి



ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. 1992 – 93 బ్యాచ్ పదో తరగతి తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. తొలుత తమ గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు బుడ్డాబాబు, బండి సురేఖ, పంబాల శ్రీనివాస్ రెడ్డి, వాల్మేటి హర్షవర్ధన్, నిడిగుంట రాజా, బండారం ఉమామహేశ్వరావు, వేలమూరి కిరణ్‌కుమార్, కర్పూరం కృష్ణారెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: పట్టణంలోని డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో 1990-91 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం సందడి చేశారు. వివిధ రంగాల్లో స్థిరపడిన సుమారు 120 మంది పూర్వవిద్యార్థులు కలుసుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు జోసఫ్, అబ్దుల్ రహీమ్, సిద్ధయ్య, విజయలక్ష్మి, అహ్మద్ బాషా, మస్తానయ్య ఘనంగా సన్మానించారు.

### వెంకటాచలంలో ముగిసిన క్రికెట్ పోటీలు

వెంకటాచలం: సంక్రాంతిని పురస్కరించుకుని వెంకటాచలంలో ఏర్పాటు చేసిన కాకాణి రమణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. విజేతగా నిలిచిన వెంకటాచలం జట్టుకు ట్రోఫీతో పాటుగా రూ.50 వేలు, రన్నర్‌గా నిలిచిన సర్వేపల్లి జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతులను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య చేతుల మీదుగా సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కిరణ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### అన్నప్రసాద వితరణకు నగదు విరాళం

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అన్నప్రసాద వితరణకు నెల్లూరుకు చెందిన మద్దినేని విజయ్‌భాస్కర్ నాయుడు, రాజ్యలక్ష్మి దంపతులు, వారి కుమారుడు, వివేక్ చరణ్, కుమార్తె చైతన్య హర్షిణి రూ.లక్ష నగదును ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యాహణాధికారి బండి శాంతయ్యకు ఆదివారం అందజేశారు.

### ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి సమీపంలో ఆదివారం రోడ్డు పక్కన ఆగి ఉన్న కేజ్ వీల్స్ ట్రాక్టర్‌ను ఆమనిచిరివెళ్లకు బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు ఢీకొని గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

# ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ధనలక్ష్మీపురంలో పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ చింతారెడ్డిపాలెంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఆదివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించిందన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని కోరారు.

**ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం**

12వ డివిజన్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి సహకారంతో మేయర్ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీ ఆదాల ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు**

టీడీపీ, జనసేనకు చెందిన పలువురు యువకులు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. ధనలక్ష్మీపురంలో స్థానిక వైఎస్సార్‌పీపీనేత గుంటక వంశీ ఆధ్వర్యంలో 300 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే నగరంలోని 34వ డివిజన్‌కు చెందిన ఉమర్‌ఫారూక్ తన మిత్ర బృందం 50 మంది ముస్లిం యువత నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో పార్టీలో చేరారు. వారికి ఎంపీ ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయడెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు కోరారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ రాష్ట్ర 2వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో గత 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని, ఎన్నో ఏళ్లుగా వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్న వారిని విద్యార్హత ఆధారంగా షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలని కోరారు. మీటర్ రీడర్లకు ఫీస్‌రేటు రద్దు చేసి కనీసవేతనాన్ని నేరుగా అందజేసి ఉద్యోగభద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బిల్ కలెక్షన్ ఏజెంట్లు, స్టోర్స్‌లో హమాలీలుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనం అందజేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, అర్హులైన కార్మికులకు వారి అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సూరిబాబు, అధ్యక్షుడు రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుమన్, కోశాధికారి విజయరావు, ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వయోపరిమితిని పెంచాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): మినిమం టైమ్ స్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న 1998 బ్యాచ్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాతికేళ్ల అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మానవతా దృక్పథంతో తమకు ఉద్యోగావకాశం కల్పించారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఉద్యోగంలో చేరిన తమకు ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్లుగా నిర్ధారించారని, ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లుగా ఉన్నందున తమకు ఆ వెసులుబాటు కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి కాకాణి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, రిజ్వీ, ఎస్‌కేఎం గౌస్‌మొహిద్దీన్, ఆర్ రాంబాబు, కృష్ణారెడ్డి, నయీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల రాణింపులో తల్లిదండ్రుల పాత్ర కీలకం





మాట్లాడుతున్న విశ్రాంత ఎంఈఓ నరసయ్య

నెల్లూరు రూరల్: విద్యార్థుల రాణింపులో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని విశ్రాంత ఎంఈఓ నరసయ్య అన్నారు. కొత్తూరు, శ్రామికనగర్‌లోని ఎస్వీఎస్ స్కూల్‌లో ఆదివారం సాయంత్రం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు పిల్లలపై తగిన శ్రద్ధ చూపితే వారు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, ఇన్‌చార్జి గౌరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డీవైఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) సభ్యత్వ నమోదును నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ డీవైఎఫ్‌ఐ దేశంలోనే అతిపెద్ద యువజన సంఘమన్నారు. తమ సంఘం స్థానిక సమస్యలతో పాటు నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 26వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఈ నెల 27 నుంచి విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద 36 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, జగదీష్, శేఖర్, బాబు, సురేష్, శ్రీనివాసులు సుబ్బరాయుడు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంధ మహోత్సవం



గంధం తీసుకొస్తున్న కమిటీ సభ్యులు

సంగం: మండలంలోని దువ్వూరులో కొలువైన హజరత్ ఖాజా గరీబ్ నివాజ్ మొయినుద్దీన్ చిష్టి రహమతుల్లా అలై ఆజ్మీరి దర్గాలో గంధమహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆస్తానా ఏ నూరియాలో హజరత్ షేక్ భాషా సాహెబ్ నూరి ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ గంధాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. గంధం ఆస్తాన ఏ నూరియాకు చేరుకున్న అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంధ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులకు గంధాన్ని పంచి పెట్టి ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్తాన ఏ నూరియా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ–2024ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసరెడ్డి, రంగనాథబాబు, శేషారెడ్డి, పాపయ్య , అనిత తదితరులు పాల్గొన్నారు.

### విజయ్‌కుమార్‌కు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత ప్రభుత్వ ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ దేసు విజయ్‌కుమార్‌ను నవాబుపేటలోని ఆయన నివాసంలో పలువురు ఆదివారం సన్మానించారు. ఏపీ ఎమ్మార్పీఎస్‌తో పాటు ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు, శాలువాలతో విజయకుమార్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఆర్యవైశ్య నాయకులు చరణ్‌తేజ్, హరిప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

### 11న కళానీరాజనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఫిబ్రవరి 11న ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బయ్యా వెంకటరమణయ్య స్మృత్యార్థం కళానీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమ నిర్వాహకుడు కేతాసుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను పురమందిరం ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ సంగీత, జానపద గేయాలు, శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్య పోటీలను ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రోత్సాహకంగా నగదు, సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఫిబ్రవరి 5లోగా 77299 42543 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సుందరరామిరెడ్డి, రఘురామిరెడ్డి, మహేష్, మధుసూదన్ పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని జాకీర్‌హుస్సేననగర్ సమీపంలోని పెన్నానదిలో పేకాటాడుతున్న నలుగురు జూదరులను నవాబుపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ 20వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

### ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

చేజర్ల: పెరుమాళ్లపాడులో చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చదువు మానేసిన విద్యార్థులు, 10వ తరగతి పాసై ఇంటర్మీడియట్ చేరని విద్యార్థుల డేటాను సేకరించి సమీప సచివాలయ కార్యదర్శి, సర్పంచ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.ప్రసాద్, చేజర్ల జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

దుత్తలూరు: హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు బెల్లంకొండ పెదభద్రయ్య కోరారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వెంగమాంబ దేవస్థానంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అష్టోత్తర పూజ, కుంకుమార్చన, తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మ వారికి మేళతాళాల నడుమ పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వై.లావణ్య అన్నమాచార్యుల కీర్తనల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సనాతన హిందూ ధర్మ పరిరక్షణార్థం హిందూ ధర్మం మరింత వ్యాప్తి కోసం ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 'మట్టిబండి' దీర్ఘకవిత రైతుజీవన ప్రతిబింబం



నాగభైరవ ఆదినారాయణను సన్మానిస్తున్న కవులు, రచయితలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో 'భాషా విభూషణ' నాగభైరవ ఆదినారాయణ రచించిన 'మట్టిబండి' దీర్ఘకవిత పరిచయ వేదిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీజెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావంతో రైతుజీవితం ఎన ఒడిదొడుకులకు లోనవుతుందోనన్న విషయాన్ని నాగభైరవ ఆదినారాయణ తన దీర్ఘకవితలో వివరించారని తెలిపారు. దీర్ఘకవితలోని ప్రతి పదం మనస్సును తాకేలా ఉందన్నారు. ఈ సందర్భంగా కవి నాగభైరవ ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. తొలుత కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, రచయితలు మెట్టు రామచంద్రప్రసాద్, ఎస్ఆర్ తపస్వి, గంగిశెట్టి శివకుమార్, బీరం సుందరరావు, నూనె అంకమరావు, తేళ్ల అరుణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గోవిందరాజు సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర్ బాబు పర్యవేక్షించారు.

## వెంకయ్య, చిరంజీవికి కళాభివందనాలు



మాట్లాడుతున్న అనంత్

నెల్లూరు(బృందావనం): స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి దేశ అత్యున్నత స్థాయి పురస్కారం 'పద్మ విభూషణ్' అందుకున్న తెలుగుజాతి ముద్దుబిడ్డలు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవికి ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్‌చాంబర్ నెల్లూరు డివిజన్ తరఫున ఆ చాంబర్ జిల్లా కోఆర్డినేటర్ కళాంజలి అనంత్ అభినందనలు తెలిపారు. ఆదివారం లస్సీసెంటర్‌లోని కళాంజలి సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు వెంకయ్యనాయుడు, చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని వివరించారు. వారి గొప్పతనాన్ని కొనియాడారు. ఈ సమావేశంలో చాంబర్ సభ్యులు శైలజ, కూనం ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్ మల్లికార్జున్, కళాకారులు శివకుమార్, బెనర్జీ, రూప పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలతో అప్రమత్తం



తనిఖీలు చేస్తున్న జిల్లా ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులకు వారి బాధ్యతలను గుర్తుచేస్తున్నారు. తనదైన శైలిలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూనే సుతిమెత్తగా హెచ్చరికలు చేస్తున్నారు. గత వారం రోజులుగా జిల్లా సర్కిల్ పరిధిలోని రూరల్ ప్రాంతాలతో పాటు నెల్లూరు టౌన్ డివిజన్లలో విద్యుత్ ఎక్కువగా వినియోగించే (పీక్ టైం)రాత్రి వేళల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సబ్‌స్టేషన్ల లోడ్ కెపాసిటీ, విధి నిర్వహణలో సిబ్బంది పనితీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. దీంతో ఏ రోజు, ఏ ప్రాంతానికి, ఏ సమయంలో ఎస్ఈ వస్తారోనని సిబ్బందితో పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు.

## జెడ్పీ వాకర్స్‌కు సన్మానం



వాకర్స్‌కు సత్కారం

నెల్లూరు రూరల్: నగరంలోని పొదలకూరురోడ్డు జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిండు నూరేళ్లు వర్ధిల్లు కార్యక్రమాన్ని ఆదివారం సన్మానించారు. అందులో భాగంగా జనవరిలో జన్మించిన వాకర్స్ మురుగన్, శ్రీనివాసులురెడ్డి, ప్రవీణ, విమలకుమారి, అహ్మద్‌హుస్సేనిను సన్మానించారు. అనంతరం హైస్కూల్ ఆవరణంలో మొక్కలు నాటారు. వసతిగృహ విద్యార్థులకు బిస్కెట్లు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, తుంగా నారాయణరెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, ప్రసాద్, అనంతరావు, రఘురామిరెడ్డి, మేరీ బ్లెసింగ్‌టన్, ఎస్తేరురాణి, హరిసుధా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భారతి ఆధ్వర్యంలో 'మంచి మాట'



మంచి మాట కార్యక్రమం నిర్వహిస్తున్న సమితి సభ్యులు

ఆత్మకూరు: ప్రపంచంలో మరే భాషకు తీసిపోని విధంగా తెలుగు సాహిత్యం ప్రఖ్యాతిగాంచిందని ఇతిహాసాలు, పురాణాలు, శతకాలు, ప్రణయతత్వం, భక్తి, తదితర అంశాలను సాహిత్యంలో పొందుపరచడంతో ఆ సౌరభాలు దేశ వ్యాప్తంగా వెదజల్లాయని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరుకు చెందిన తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో మేధా పాఠశాల ఆవరణలో 'మంచి మాట' కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి, గోవింద రెడ్డి, ఎస్వీ చలమయ్య తెలుగు సాహిత్యం గొప్పదనాన్ని వివరించారు. కవన విహార కేంద్రం – ఖండ కావ్యం అనే అంశంపై పెద వెంకటరెడ్డి వివరించారు. తెలుగు సాహిత్యాన్ని రాజుల కాలం నుంచి ఎందరో రాజులు, సామంత రాజులు, జమీందార్లు పెంచి పోషించారని, వారి వల్లే ఇప్పటికీ ఎన్నో సాహితీ రచనలు, కావ్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రఖ్యాత తెలుగు కవులు రాయప్రోలు, విశ్వనాథ సత్యనారాయణ, జంధ్యాల పాపయ్య శాస్త్రి, గుర్రం జాషువ, తదితరుల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సోమవరపు సుబ్బరాయుడు, వెంకటరెడ్డి, ఎస్వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, రవీంద్ర, రామయ్యస్వామి, నారాయణరావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.